

జ్యోత్స్నారాణి రచనలను ఆవిష్కరిస్తున్న ఎస్‌వీ సత్యనారాయణ తదితరులు

మనుషులను కలిపేది సాహిత్యం

చిక్కడపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం మనుషులను కలిపితే, రాజకీయాలు విడదీస్తాయని తెలుగు యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ అన్నారు. జ్యోత్స్న కళాపీఠం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో డా. శరత్‌జ్యోత్స్నా రాణి రచనల ఆవిష్కరణ, క్రోధి నామ ఉగాది పురస్కారాల ప్రదానసభ జరిగింది. పద్య కవిత్వంలో చిట్టేశ్వరశర్మకు, వచన కవిత్వంలో జూపాక సుభద్రకు, సాంస్కృతికరంగంలో వేటూరి రామకృష్ణారావుకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఆచార్య సత్యనారాయణ మాట్లాడుతూ.. జ్యోత్స్నారాణి భిన్న రంగాల్లో ప్రతిభావంతులన్నారు. సాధన నరసింహాచార్య, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి గడప నిరూప, ఆచార్య సూర్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస సంపుటి కామన్ సెన్స్

మాధురి వారణాసి రచించిన కామన్ సెన్స్ వ్యక్తిత్వ వికాస సంపుటి అని సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. కామన్ సెన్స్‌కు తెలుగులో సరైన అర్థం ఇంగితం లేదా లోకజ్ఞతగా చెప్పవచ్చన్నారు. వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో కామన్ సెన్స్ గ్రంథ పరిచయ సదస్సు మంగళవారం జరిగింది. ఆచార్య శివారెడ్డి మాట్లాడుతూ.. భార్యాభర్తల సంబంధాలు దిగజారుతున్న నేటి కాలంలో బంధాల విలువలు, నైతిక సంబంధాలు బోధించే కామన్ సెన్స్ గ్రంథం అర్థవంతంగా ఉందన్నారు. కామన్ సెన్స్ వైవిధ్య రచన అని వివరించారు. కేతవరపు రాజ్యశ్రీ, భారతిరామచంద్రన్, సరస్వతి అవధాని కూచి సాయి శంకర్ తదితరులు గ్రంథంలోని అంశాలు విశ్లేషణ చేశారు. వంశీ రామరాజు అధ్యక్షత వహించిన సభలో గ్రంథ రచయిత్రి మాధురి వారణాసి తొలి ప్రతిని రాధ వ్యాసకృష్ణ దంపతులకు అందజేశారు.

డాక్టర్ నీలా శ్రీధర్‌కు వంశీ ఉగాది పురస్కారం ప్రదానం

రాంనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వైశ్య సమాఖ్య తెలంగాణ శాఖ ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్‌కు ప్రముఖ సాహిత్య, సాంస్కృతిక, సమాజ సేవ సంస్థ వంశీ ఆర్ట్ థియేటర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వంశీ ఉగాది పురస్కారం ప్రదానం చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, బ్రహ్మశ్రీ డాక్టర్ మాడ్గుల నాగఫణిశర్మ, ప్రముఖ సినీ నటులు మురళీమోహన్, కోట సత్యనారాయణ, సుమన్ పాల్గొన్నారు.



నీలా శ్రీధర్‌కు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న మాడ్గుల వాగ్ఫణిశర్మ, చిత్రంలో నటుడు సుమన్ తదితరులు

రెండు లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తా

కాంగ్రెస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్

రాంనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండు లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ తెలిపారు. మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా బాకారం బొమ్మలగుడిలో పూజలు చేసి జీపు యాత్ర చేస్తూ పలు బస్తీల్లో ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. రిసాలగడ్డ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై నమ్మకంతో సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సికింద్రాబాద్‌లో గెలిచి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తానన్నారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తన గెలుపునకు దోహదపడతాయని అన్నారు. అంజన్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మోసపూరిత మాటలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలు, హక్కుల కోసం పాటుపడే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి అత్యధిక ఓట్లు దానంకు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని సూచించారు. ప్రచారంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు ఆర్. కల్పనా యాదవ్, వాజిద్ హుస్సేన్, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ జుహేర్ హుస్సేన్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిలు కె. గౌరీశంకర్, పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ రిసాలగడ్డలో మాట్లాడుతున్న దానం నాగేందర్

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం

సనత్‌నగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ విజయం ఖాయమని, రాష్ట్రంలో అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలపై ప్రజలు సంతోషంగా ఉన్నారని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. మంగళవారం సనత్‌నగర్ డివిజన్‌లో ఆయన ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. మతతత్వ బీజేపీ, అవినీతి బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు అవస్థలు పడ్డారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. 10 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ హయాంలో పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, నిరుద్యోగం గతంలో ఎప్పుడూ లేనంతగా పెరిగిందన్నారు. రైతుల ఆదాయం డబుల్ చేస్తానన్న బీజేపీ రైతు చట్టాలు తీసుకువచ్చి వారిని మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ, డాక్టర్ రవీందర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు నరేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సనత్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న దానం నాగేందర్

బీఆర్‌ఎస్‌లో స్వేచ్ఛ కోల్పోయా

బంజారాహిల్స్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌లో ఉండగా కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు కూడా ఇప్పించుకోలేకపోయానని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు ఆధ్వర్యంలో పలు బస్తీలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, దీపా, గోపాల్‌నాయక్‌తో పాటు సుమారు మూడు వందల మంది దానం సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. వారందరికి కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లో ఉండగా స్వేచ్ఛ కోల్పోయినట్టు చెప్పారు. ఏడున్నర సంవత్సరాల వ్యవధిలో కేసీఆర్‌ను కలిసింది ఐదుసార్లు మాత్రమేనని, కేటీఆర్‌ను కలిసింది కూడా తక్కువేనని తెలిపారు. కార్యకర్తలకు పార్టీ పదవులు కూడా ఇప్పించలేని పరిస్థితులు ఎదుర్కొన్నట్టు వివరించారు. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత స్వేచ్ఛ లభించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని, కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకే తాను పార్టీలో చేరినట్టు చెప్పారు. ఢిల్లీలో సోనియాగాంధీ కార్యాలయం నుంచి ఆదేశాలు అందడంతో ఎంపీగా పోటీ చేస్తున్నట్టు తెలిపారు. కష్టపడే వారికి గుర్తింపు ఇచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావుకు కార్పొరేషన్ లేదా ఎమ్మెల్సీ పదవి ఇప్పించనున్నట్టు ప్రకటించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎక్కడకు వెళ్లినా తనకు ఆదరణ లభిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధిస్తానని దానం ధీమా వ్యక్తం చేశారు.

పద్మారావుగౌడ్‌ను గెలిపించాలి

ముషీరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కారు గుర్తుకు ఓటేసి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకుడు ముఠా జైసింహ కోరారు. మంగళవారం భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్, గుల్షన్‌నగర్‌లో డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పద్మారావు గౌడ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ... రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన కేసీఆర్‌కు బడుగు, బలహీన వర్గాల ప్రజల మద్దతు ఉందని, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు షరీఫ్ ఉద్దీన్, రహీం, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, సీనియర్ నాయకులు చాంద్‌పాషా, జునేద్ బాగ్దాదీ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల ప్రచారం

చిలకలగూడ: కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత మంగళవారం కేశవనగర్‌లో కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

అడ్డగుట్ట: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయం ఖాయమని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం పద్మారావు గౌడ్‌కు మద్దతుగా తుకారాంగేట్ ఇందిరాలక్ష్మినగర్, వెంకట్‌నగర్ అడ్డగుట్ట పరిసర ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.





పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్లు రాసూరి సునీత, లింగాని ప్రసన్నలక్ష్మి



మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా నాయకులు

బీజేపీ మిత్రపక్షాలను ఓడించాలి

రాంనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మిత్ర పక్షాలను ఓడించాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, కేంద్ర కమిటీ సభ్యులు కేజీ రాంచందర్, కె. రమ కోరారు. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మిత్రపక్షాలను ఓడించేందుకు ప్రజాస్వామిక శక్తులంతా కృషి చేయాలన్నారు. ఇండియా కూటమికి సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు కె. సూర్యం, ఎస్.ఎల్. పద్మ, హన్మేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలి

రాంనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో దివ్యాంగులకు ఒక సీటు కేటాయించాలని డెవలప్‌మెంట్ ఫర్ సొసైటీ డెఫ్ (డీఎస్‌డీ) సంస్థ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని డీఎస్‌డీ సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు జరగబోతున్నాయని, రాష్ట్రంలో 20 లక్షల మంది ఉన్న దివ్యాంగులకు ఒక ఎమ్మెల్సీ సీటు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఈ మేరకు అసెంబ్లీలో చట్టం చేయాలన్నారు. తమ డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చిన పార్టీలకే లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు వేస్తామని చెప్పారు. సమావేశంలో సంస్థ జాతీయ కో- కన్వీనర్ కాటమోని వెంకటేశ్, నాయకులు సత్యనారాయణ, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్

3న రాజ్‌నారాయణ్‌కు అమెరికాలో సన్మానం

బర్కత్‌పుర, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌కు అరుదైన గౌరవం లభించబోతున్నది. 40 ఏళ్లుగా సేవా, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో సేవలందించినందుకు మే 3వ తేదీన అమెరికాలోని టెక్సాస్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఆయనను సన్మానించనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను టెక్సాస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డేవిడ్ ఎ డైనీ మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ శాంతి, జాతీయ సమైక్యత, మత సామరస్యం, న్యాయపరమైన చట్టాలపై అవగాహన శిబిరాలను నిర్వహించినందుకు ఈ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



పదో తరగతి ఫలితాల్లో గీతాంజలి విద్యార్థుల ప్రతిభ

చిక్కడపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అశోక్‌నగర్‌లోని గీతాంజలి ఉన్నత పాఠశాల విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించారు. మోక్షిత 9.7, శ్రేయాస్ 9.5 జీపీఏ సాధించారు. మరో ఐదుగురు విద్యార్థులు 9 జీపీఏ, మరో తొమ్మిది మంది 8 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించింది. ఉత్తమ ఫలితాలు రావడానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేసింది.



మోక్షిత, శ్రేయాస్



విద్యార్థులను సన్మానిస్తున్న కవాడిగూడ ఇంగ్లిష్ యూనియన్ స్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణలతారెడ్డి

విద్యార్థులకు సన్మానం

కవాడిగూడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను కవాడిగూడ ఇంగ్లిష్ యూనియన్ స్కూల్ ప్రిన్సిపాల్ పి. స్వర్ణలతారెడ్డి అభినందించి సన్మానించారు. 220 మంది పరీక్ష రాయగా వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాకతీయ హైస్కూల్‌లో వందశాతం ఉత్తీర్ణత

రాంనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కాకతీయ హైస్కూల్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణులయ్యారని కరస్పాండెంట్ గోక నవీన్, ప్రిన్సిపాల్ రామరాజు తెలిపారు. 37 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 100 శాతం ఉత్తీర్ణులయ్యారన్నారు. టి. హరిప్రియ 10 జీపీఏ, కె. భువనేశ్వర్ 9.8, జి. కార్తీక్ 9.7, ఎ. హాసిని 9.7 జీపీఏ సాధించారని పేర్కొన్నారు. 8 మంది విద్యార్థులు 9 గ్రేడ్, 16 మంది 8, ఎనిమిదిమంది 7 గ్రేడ్‌లు సాధించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తున్న కరస్పాండెంట్ నవీన్, ప్రిన్సిపాల్ రామరాజు

బీసీలను ఓట్లు అడిగే హక్కు బీజేపీకి లేదు

బర్కత్‌పుర, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీసీలను ఓట్లు అడిగే హక్కు బీజేపీకి లేదని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎ. రాజేశ్వర్‌యాదవ్ అన్నారు. పదేళ్ల మోదీ పాలనలో జనాభాలో 55 శాతం పైగా ఉన్న బీసీలను నిర్లక్ష్యానికి గురిచేశారని ఆరోపించారు. బీసీ కులగణన చేయబోమని చెప్పిన బీజేపీకి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. మంగళవారం కాచిగూడలో సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ పై నుంచి పడి కార్మికుడి మృతి

అంబర్‌పేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఛేనంబర్ చౌరస్తాలో నిర్మాణంలో ఉన్న ఫ్లైవర్ పై నుంచి పడి కార్మికుడు మృతి చెందాడు. అంబర్‌పేట సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన ప్రబీర్ సర్దార్(22) అంబర్‌పేటలో ఫ్లైఓవర్ నిర్మాణ పనికి వచ్చాడు. మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఫ్లైఓవర్ పై సెంట్రింగ్ పనిచేస్తూ ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలవడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అంబర్‌పేట పోలీసులు ఫ్లైఓవర్ నిర్మాణ సంస్థపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




ప్రబీర్ సర్దార్ (ఫైల్)

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి..

బర్కత్‌పుర, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహాన్ని కాచిగూడ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణచారి తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో 4వ నంబర్ ప్లాట్‌ఫారం వద్ద 50 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం చనిపోయాడు. ప్రయాణికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభానికి మంటలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ టీఆర్‌టీ గ్రౌండ్ వద్ద విద్యుత్ స్తంభానికి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. అప్రమత్తమైన స్థానికులు నీరు చల్లి, మట్టిపోసి మంటలను ఆర్పివేశారు. సమాచారం అందుకున్న గాంధీనగర్ విద్యుత్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.



కాలిపోతున్న స్తంభం

జీహెచ్‌ఎంసీ డ్రైవర్‌పై పోక్సో కేసు

బర్కత్‌పుర, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని బాలికను మోసం చేసిన ఓ వ్యక్తిపై కాచిగూడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నింబోలి అడ్డలో నివసిస్తున్న రాంచంద్రయాదవ్ అలియాస్ టిల్లు (25) జీహెచ్‌ఎంసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని ఓ బాలికను మోసం చేశాడు. బాలిక తల్లిదండ్రులు మంగళవారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాంచంద్రయాదవ్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటీ కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 7893141797 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

తెలుగు వర్సిటీలో ఫైన్ ఆర్ట్స్ శిక్షణా తరగతులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో శిల్పం, చిత్రలేఖనం శాఖ ఆధ్వర్యంలో ఫైన్ ఆర్ట్స్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భట్టు రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 8309011865, 8309498807 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

'న్యాయ విద్య పవిత్రమైంది'

రాంనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పేదలకు న్యాయ సేవలు అందించేందుకు అంబేడ్కర్ లా కళాశాల విద్యార్థులు కృషిచేయాలని కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్ సూచించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో కళాశాల ఆవరణలో 5, 3 సంవత్సరాల న్యాయ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల వీడ్కోలు సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. న్యాయ విద్య పవిత్రమైనదని అన్నారు.